# తీరని కోరిక

## పాలకూర సీతాలత




వరాలు పూర్తి పేరు వరలక్ష్మి. జీవిత మన్నాక ప్రతీ వారికీ కొన్ని కోరికలు ఉంటాయి. కోరిక లంటూ ఉన్నాకా వాటిలో ఒకటి తీరని కోరిక కావచ్చు. ఇందిరాగాంధీకి మళ్ళీ ప్రధాన మంత్రి అవ్వాలని కోరిక ఉండచ్చు. బిర్లాకి మరిన్ని కోట్లు సంపాదించాలని కోరిక ఉండచ్చు.

కానీ వరాలుకు ఉన్న కోరిక అంత పెద్దది కాదు. ప్రధాని పదవి దేవుడెరుగు, కనీసం పంచాయితీ బోర్డు మెంబరు కావాలనికూడా కోరిక లేదు. లక్ష రూపాయల్ని ఒక్కసారికూడా చూడని ఆమెకు కోట్లు సంపాదించాలనీ లేదు. సొంత ఇల్లు కావాలనీ, ఒక కారు ఉండాలని కూడా ఆమె ఎన్నడూ కోరుకోలేదు. ఆమె కోరిక విన్న ఇరుగు పొరుగు వాళ్ళు నవ్వారు.

వరప్రసాదరావు ఎవరో కాదు. వరలక్ష్మి మెడలో మూడు ముళ్ళు వేసిన వ్యక్తి. ఒక పెద్ద కంపెనీలో చిన్న సైజు ఆఫీసరు. వరలక్ష్మికి ఏ లోటూ రాకుండా చూసుకునే వ్యక్తి. ఆమెను ప్రేమించే హృదయం ఉన్నవాడు. అన్నింటినీ మించి అతను తెలుగు సాహిత్య నందనవనంలో కొన్ని సంవత్సరాల క్రితం పుట్టి పరిమళాలు వెదజల్లుతున్న వాడు. అతను రాసిన చాలా కథలు వివిధ పత్రికల్లో అచ్చు అయ్యాయి. మంచి రచయితగా పేరుంది. సాధారణంగా ప్రతీ రచయితకీ ఉండేది, అతనికి లేనిదీ సిగరెట్ అలవాటు.

అందుకే చాలా అసంతృప్తి చెందింది వరాలు. ఆమె తీరని కోరికకూడా అదే. భర్త సిగరెట్ తాగాలని. ఇది చాలా సిల్లీ విషయంగా అనిపించవచ్చు. సాధారణంగా భర్తలు పొగ తాగడం ఏ భార్యకీ ఉండదు. కానీ ఇందుకు భిన్నంగా వరాలు కోరడం ఆశ్చర్యమే.

కానీ వరాలు కోరికలో అర్థం ఉంది. తన భర్త సిగరెట్ అలవాటుకు బానిస అయిపోవాలని ఆమె కోరిక కాదు. అతనికి సిగరెట్ అలవాటు ఉండి కొన్నాళ్ళకి తను "సిగరెట్లు మానెయ్యండి" అని చెపితే మానెయ్యాలి.

భార్య చెప్పిందని భర్త సిగరెట్ తాగడం మానేస్తే అది భార్యకు ఒక క్రెడిట్ పాయింట్ నా కోసం దాన్ని త్యాగం చేశారు కదా. దీనికి కారణం ఆయన నన్ను అమితంగా ప్రేమించడమే" అని మురిసి పోతుంది. అలా మురవాలనే వరాలు కోరిక.

కానీ అసలు సిగరెట్ అంటే ఆమడ దూరం పరుగెత్తే వరప్రసాదరావు ద్వారా ఆమె కోరిక తీరటం అసంభవం కదా. అందుకే తన దురదృష్టానికి నిందించుకుంది. తనేదో కష్టాలలో ఉన్నట్లు బాధ పడింది. పెళ్ళికి ముందే వరప్రసాదరావుకు పొగ తాగే అలవాటుందో, లేదో తెలుసుకోకపోవటం తను చేసిన పెద్ద తప్పని భావించింది.

ఆమె బాధ మరింత పెరగడానికి కారణం అతను రచయిత కావడం. సాధారణంగా భావావేశంతో రాసే వాళ్ళు పొగ తాగడం కద్దు. అలాంటిది వరప్రసాదరావు ఆ అలవాటు లేకుండానే పేజీలు పేజీలు నింపేస్తాడు అక్కడికీ నోరు విడిచి చెప్పింది.

"సాధారణంగా ఊహాలు కదుల్చుకోవడానికి, అదే 'మూడ్' తెచ్చుకోవడానికి ఏం చేస్తారు?" అని ప్రశ్నించింది మొగుడ్ని ప్రెస్ రిపోర్టర్ లాగ. అతను మాత్రం అతి సాధారణంగా "ఇంటి కప్పు వైపు చూస్తాను. లేదా తిరుగుతున్న ఫాన్ వైపు చూస్తాను. అదీ కాదంటే గోళ్ళు కొరుక్కుంటాను" అన్నాడు.

ఆమె గుండెల్లో మరింత చిచ్చు రగిల్చిన వాడు. ఆమె అన్న అచ్యుతం. అతనికి చాలా ఎక్కువగా సిగరెట్లు తాగే అలవాటుంది. ఒక రకంగా చెయిన్ స్మోకర్. నిత్యాగ్నిహోత్రుడన్నమాట. అలాంటిది పెళ్ళి చేసుకున్న రెండు నెలల్లో సిగరెట్లు మానేశాడు. కారణం అడిగితే—

"నా పెళ్ళాం మానెయ్యమంది. తనకీ పొగ పడటం లేదు. నా ఆరోగ్యం పాడవటం తను సహించ

లేదు. అందుకే అది కోరిక మీదట మానేశాను" అన్నాడు.

అది భార్యా విధేయతకి చిహ్నంగా తీసుకున్నారు అందరూ. అతని మాటలు విన్న వరాలుకీ ఒళ్ళు మండింది. తనకి దొరకని భాగ్యం ఏదో తన అన్నగారి పెళ్ళానికి దొరికి పోయిందన్న అసూయ ఆమె కళ్ళలో కదిలింది. అందుకే అన్నతో అంది—

"అదేమిట్రా? పెళ్ళాం చెప్పిందని మానెయ్యడమే. నీ పెళ్ళాంతో నీ పరిచయం కన్నా, నీకు సిగరెట్లతో గల పరిచయం నాలుగేళ్ళు ఎక్కువ కదరా! పెళ్ళాం కోసం సిగరెట్లు మానుకుంటావా?. . . అవ్వ. . . ఇలా అయితే ఆవిడకు లొంగిపోవురా నువ్వు? ఏమోనమ్మా. . . నే నెప్పుడూ వినలేదు . . . భార్యగారు ఏదో చెప్పారట. . . ఈ భర్తగారు ఏదో చేశారట. . ."

ఆమె గొణుగుడులో అలాంటి భాగ్యం తనకు రాలేదన్న బాధ స్పష్టం అయింది.

అంతగా ఆ అలవాటున్న వాడు ఒక్కసారి వాటికి విడాకులు ఇచ్చెయ్యడం ఆశ్చర్యమే. అచ్యుతం సిగరెట్లు పూర్తిగా మానలేదు కానీ బాగా తగ్గించాడు.

వరాలు మొగుడి చేత ఒక ఆష్‌ట్రే కొనిపించింది. "నేను పొగ తాగనప్పుడు ఎందుకిది?" అన్నాడు వరహాలరావు.

"అప్పుడప్పుడు మీ స్నేహితులు వస్తూంటారు. వాళ్ళకి అవసరం అవుతుంది. అయినా హాలు మధ్యలో ఒక టీపాయ్ ఉండటం, దానిమీద ఆష్‌ట్రే ఉండటం, అది నిండుతుండటం ఫాషన్" అంటూ లెక్చరిచ్చింది.

సిగరెట్ తాగకుండానే మొగుడికి కథలు రాసే మూడ్ తెప్పించే ఇంటి కప్పు, సీలింగ్ ఫాన్, అతని చేతి గోళ్ళూ వీటిమీద చాలా కోపం వచ్చింది. అవి ఇంట్లో ఉండకుండా చెయ్యాలనుకుంది. మిగతా రెండూ లేకపోయినా ఫరవాలేదు కానీ ఇల్లన్నాక ఇంటికి కప్పు లేకుండా ఎలా?

సాధారణంగా రాత్రి పది గంటలకి వరాలు మంచం ఎక్కేస్తుంది. వరహాలరావు రచన కొనసాగించేది అప్పుడే. మూడ్‌ని బట్టి గంటో, రెండు గంటలో రాసుకుని ఆ తరవాత అతనూ పడుకుంటాడు.

ఒక రోజు ఉదయమే బాయిలర్ వెలిగించడానికి వంటింట్లో అగ్గిపెట్టె కోసం వెదికింది వరాలు. అది యథాస్థానంలో లేదు. వంటిల్లంతా వెతికినా కనిపించ లేదు. ఇంతలో పాలవాడు పెట్టిన కేక అందుకుని పాలు పోయించుకుందుకు హాల్లోకి వెళ్ళిన వరాలుకి టీపాయ్ మీద అగ్గిపెట్టె కనిపించింది. దాన్ని తీసుకుని పని జరిపినా ఆమె ఆలోచిస్తూనే ఉంది. తను వంటింట్లో పెట్టిన అగ్గిపెట్టె హాల్లోకి ఎలా వెళ్ళింది? ఏ వస్తువుకూడా బాహ్య శక్తుల ప్రమేయం లేనిదే తనున్న చోటు నుండి, తనంతట తాను కదలలేదని కదా న్యూటన్ తన గమన సూత్రాల్లో తెలిపాడు. ఆలోచనలు తెగక మొగుడ్నే అడగచ్చని ఊరుకుంది.

"నిన్న రాత్రి వంటింట్లోంచి అగ్గిపెట్టె మీరు తెచ్చి టీపాయ్ మీద పెట్టారా?" అడిగింది భర్త ఆఫీసుకు వెళ్ళబోతుంటే

అవునని ముక్తసరిగా అని వెళ్ళిపోయాడు.

ఆ తరవాత కావాలని ఆష్‌ట్రేలో చూసింది. అందులో ఒక పీక కనిపించింది. వరాలు మనసు ఆనందంతో గంతులు వేసింది. నిన్న రాత్రి మూడ్ కోసం భర్త సిగరెట్ తాగాడన్నమాట. 'ఇలాగే కొద్ది కొద్దిగా అలవాటై పోతుందిలే' అని సరిపెట్టుకుంది. సాధారణంగా భర్త ఇకముందు సిగరెట్లు తాగనని భార్య ముందు వాగ్దానం చేస్తే ఆ భార్య ఎంత సంతోష పడిపోతుందో, అంతగానూ సంతోష పడింది. కానీ ఆమె సంతోషానికి కారణం ఇతర భార్యల సంతోష కారణానికి పూర్తిగా వ్యతిరేకం.

ఆ సాయంత్రం వరహాలరావుని తిన్నగా అడిగెయ్యాలనుకుంది—"ఏమండీ? మీరు నిన్న రాత్రి సిగరెట్ తాగారా?" అని. కానీ మళ్ళీ సరి పెట్టుకుంది. అతను సిగరెట్ తాగుతున్న మాట నిజమే అయితే భార్య ముందు అతను ఓడిపోవడమే. ఈ విషయం తను పసికట్టిందని అతనికి తెలిసిపోతే, తిరిగి మానేసే ప్రయత్నం చెయ్యవచ్చు. ఆ అలవాటు మరి కొన్నాళ్ళు అలాగే కొనసాగితే, అతను పూర్తిగా దానికి అలవాటై పోతాడు. కనక ఇప్పుడు తను ఆ ప్రస్తావన తీసుకు రాకూడదు.

ఆమె అతన్ని గమనిస్తూ, తను మాత్రం ఆ ప్రస్తావన తీసుకురాకుండా రోజులు గడుపుతూంది. ఆమె ఉదయం లేచేసరికి వంటింట్లో ఉండవలసిన అగ్గిపెట్టె నడిచి వచ్చి హాల్లో టీపాయ్ మీద ఉంటూంది రోజూ ఈమధ్య. ఆష్‌ట్రే అప్పుడప్పుడు శుభ్రంగానూ, అప్పుడప్పుడు సిగరెట్ పీకలతోనూ ఉంటూంది ఈ మధ్య. శుభ్రంగా ఉన్న రోజున భర్త పడుకో బోతూ శుభ్రం చేసి ఉండొచ్చు నని సరి పెట్టుకునేది.

ఆ రోజు రాత్రి నిద్ర పోదామని మంచం ఎక్కింది వరాలు. యథాప్రకారం వరహాలరావు మాత్రం ఏదో రాసుకుంటూ కూర్చున్నాడు. అత నీ మధ్య ఏదో పత్రిక వాళ్ళు నిర్వహిస్తున్న నవలల పోటీకని ఒక నవల తయారు చేస్తున్నాడు. మంచం ఎక్కిన వరాలు మనస్సులో భర్త సిగరెట్ తాగుతున్న దృశ్యం చూసి తీరాలన్న కోరిక రేగింది. ఎడం చేతిలో వేళ్ళ మధ్య సిగరెట్ ఇరికించుకుని, విలాసంగా పొగ పీలుస్తూ కుడి చేత్తో ఏదో భర్త రాసేస్తున్న దృశ్యంవూహించుకుంది. వస్తున్న నిద్రని బలవంతంగా వాయిదా వేసి అలాగే పడుకుండి పోయింది వరాలు.

ఒక అరగంట తరవాత భర్త వంటింటి లైటు



MCA-NR-55-Tel

వెయ్యడం. అగ్గిపెట్టె చప్పుడుకావడం గమనించింది. భర్త హాల్లోకి వెళ్ళేదాకా ఆగి, బాత్రూములోకి వెళ్ళి వచ్చి కర్టెన్ వెనకగా నిలబడి కర్టెన్ సందు లోంచి భర్తను చూసింది.

కానీ. . . ఆశ్చర్యం. . . సర్‌ప్రైజ్. . . వరహాలరావు సిగరెట్ తాగటం లేదు. కానీ హాల్లో దట్టంగా పొగ కమ్ముకుని ఉంది. ఆ పొగ వింత పరిమళాలు వెదజల్లుతూంది. ఆ పొగ దేన్నుంచి వస్తూందో కళ్ళతో చూడక పోయినా, ముక్కుతో పసి కట్టవచ్చు. అది అగరువత్తుల పరిమళం. వరహాలరావు కళ్ళు మూసుకుని, కుర్చీలో కూర్చుని, ముక్కు పెద్దది చేసుకుని ఆ పరిమళాల్ని ఆఘ్రాణిస్తూ తన్మయత్వం పొందుతూ మదుటి మీద ఎడం చేతో తి వేళ్ళకొట్టుకుంటున్నాడు.

ఆ దృశ్యం చూసిన వరాలు తుళ్ళి పడింది. పిచ్చెక్కినట్లయింది. కళ్ళు కొద్దిగా మసక బారాయి. షాక్‌కి తట్టుకో లేనట్టుగా హాల్లోకి వెళ్ళి భర్త చెంత సోఫాలో కూర్చుంది. ఆమెను గమనించ లేదు అతను. ఒక నిమిషం తరవాత చూసి

"ఏంటి? రాణిగారికి ఈ రోజు నిద్ర రావటం లేదా?" అన్నాడు.

ఆమె అందుకు జవాబు ఇవ్వలేదు. మొగుడ్ని చూస్తూ,

"మీ రిలా అగరువత్తులు రోజూ వెలిగిస్తున్నారా?" అంది.

"అవును, ఆహ్లాద వాతావరణంలో మూడ్ కుదురుతుందని, ఈ మధ్య రెండు నెలలుగా నేను రాసుకునే సమయంలో అగరువత్తులు వెలిగిస్తున్నాను ఏంటి?" అన్నాడు.

"అందుకే అన్నమాట, రోజూ నేను వంటింట్లో ఉంచే అగ్గిపెట్టె తెల్లారేసరికి హాల్లో ఉంటూంది.'

"అవును"

ఆ మూడక్షరాలూ ఆమెకు పిడుగులా తోచాయి. ఊహించినది అబద్ధం కావటం సహించలేక పోతూంది ఆమె మనసు.

"నే నింతా మీరు సిగరెట్లు తాగుతున్నా రను కున్నాను" అంది నిరాశగా.

"నో ఈ జన్మలో ఆ పని చెయ్యను" అన్నాడు నమ్మకంగా.

"నిన్నికు విడాకులు ఇస్తున్నాను" అని అతను అంటే ఆమెలో కలగవలసిన బాధ ఆమెలో అప్పుడు కలిగింది.

"మరి, ఆష్ట్రేలో నాకు అప్పుడప్పుడు కొన్ని సిగరెట్ పీకలు కన్పించేవి?" ఆ రహస్యం ఏమిటో తెలుసుకోవాలన్న ఆత్రం ఆమెది.

"అవి నేను తాగినవి కావు. ఉన్నాడుగా నీ తమ్ముడు గోపాలం. . ." అన్నాడు.

వరాలు తమ్ముడు గోపాలం ఈ మధ్యే ఇంజనీరింగ్ పాసయి ఉద్యోగ ప్రయత్నార్థం వరాలు దగ్గరే ఉంటున్నాడు ఒక రెండు నెలలుగా. అతను సిగరెట్లు తాగుతాడు. ఆష్ట్రేలో చెత్తంతా అతను పారేసింది అన్నమాట. ఆమె కోపం అంతా తమ్ముడి మీద మళ్ళింది.

"మీ రిన్నాళ్ళుగా అగరువత్తులే వెలిగిస్తుంటే దేవుడి గూట్లోని అగరువత్తుల కట్టలోని వాటి సంఖ్య త్వరగా తగ్గిపోవాలి. కానీ అలా జరగలేదే. . .' లాయర్‌లా ప్రశ్నించింది.

"భలేదానివే, నేను రాత్రి పూట వెలిగించే అగరువత్తులు వేరే కట్టలోవి. చాలా మేలు రకం. ప్రత్యేకంగా కొంటాను. ఈ కట్టని ఇక్కడే హాల్లో దేవుడి పటం వెనకగా పెడతాను. . ." అంటూ పటం వెనక నుంచి ఒక కట్ట తీశాడు.

ఆమెకు అంతా అర్థం అయిపోయింది. మరే ప్రశ్నలూ వెయ్యకుండా బెడ్ రూమ్‌లోకి వెళ్ళి పోయింది.

మంచం మీద పడుకుంది కానీ నిద్ర రాలేదు. తన ఓటమికి బాధ కలిగింది. తన కోరిక ఈ జన్మకి తీరదని నిరాశ చెందింది.

ఆమె నిద్ర పోవడానికి ప్రయత్నిస్తూంది. అతడు పేజీలు నింపడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆ రాత్రి చాలా ఆలస్యంగా ఆమెకు పట్టింది. నిద్రలో ఒక కల వచ్చింది. కలలో వరహాలరావుకి సిగరెట్లు బాగా అలవాటు అయిపోయాయి. ఆమె "సిగరెట్లు మానండి" అని భర్తను బతిమాలింది. అతను మాత్రం "నోర్ముయ్ నా ఇష్టం. నువ్వెవరు చెప్పడానికి—నా సంపాదన. నా ఇష్టం వచ్చినట్లు తగలేసుకుంటాను. పో అవతలికి" అని వరాలు మీద అరిచాడు వరహాలరావు కలలోనే. *




సపటక్
మలామ్
తామర, గజ్జి, చిడుము
పాదములమీద మరియు వేళ్ల మధ్య పగుళ్లను
బాగొట్టుటకు దివ్యమైనది.
SAPAT & CO., BOMBAY 2.
TEL.
ఏజంట్లు: ది ట్రేడ్ ప్రొమోటింగ్ కార్పొరేషన్,
విజయవాడ—520010.

"మనీకె" బ్యూటీ సెలూన్ బొంబాయికి చెందిన శ్రీమతి వి. కాంట్రేక్టర్ ఒక గణుతికెక్కిన హెయిర్ డిజైనర్. ఆమె యిలా అంటున్నారు:

"ప్రతి స్త్రీకీ ఆమె వ్యక్తిత్వంతో పాటు ఆమె జుట్టు కూడా వేరుగా ఉంటుంది. ఇహ, గ్లీమ్ శ్రేణిలో గల షాంపూలలో సరిగ్గా మీ కేంకావాలో నాకు తెలుసు."



ప్రతీ గ్లీమ్ షాంపూ దానిలోని ప్రత్యేక పదార్థాల మూలంగానూ, పుష్కలమైన నురగమూలంగానూ పూర్తి ఫలితాలను ఇస్తుంది. మీ జుత్తు ఏ రకానికి చెందినది అయినా, గ్లీమ్ మూలంగా దానికో కొత్త అందం సమకూడుతుంది. దాని ఫ్రెంచి సుగంధం మిమ్ము అంటిపెట్టుకునే వుంటుంది— ఎంతో పొదుపు కూడా.

గ్లీమ్ రిగ్యులర్
గ్లీమ్ ఎగ్
గ్లీమ్ టానిక్

ఇప్పుడు వీలైన 60 మి.లీ. సైజులో కూడా




గ్లీమ్ షాంపూ
ప్రఖ్యాత హెయిర్ డ్రెస్సర్ల మెప్పు పొందినది.

Geoffrey Manners & Co. Ltd.